# ఏడుపు ఎరుపెక్కింది

కోటమ్మ గుండెల్లో నల్లమబ్బులు కమ్ముకున్నాయి. మనసంతా దట్టంగా ముసురు పట్టింది. ఎంత తుడిచినా కంటి వెంట నీటిధార ఆగడంలేదు.

వీళ్ల బంద్ పాడుగాను.

వీళ్ల పార్టీలు నాశనం కాను.

పొగరెక్కిన ఆంబోతులు పోట్లాడుకుని లేగదూడని కుమ్మేశాయి.

మేకపిల్ల బలయిపోయింది, పులుల యుద్ధంలో

అమాయకులే చస్తారు ఏ ఉద్యమం వచ్చినా

దేశాధినేతలు బాగానే వుంటారు. పొట్టకూటికి మిలటరీలో పనిచేసే నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన సైనికులు నేలకూలతారు. ఇవన్నీ పెద్దవాడు శానా బాగా చెప్పేవాడు.

పాలక వర్గాల కుట్ర ఇదంతా అనేవాడు

తనకు సరిగా తెలిసేది కాదు

వాణ్ణలా పొట్టన పెట్టుకున్నారు ముదనష్టపోళ్ళు

పాతికేళ్ళ ఒక్క ప్రాణం వాళ్ళకేం అపకారం చేసిందో- వాడి మాటలవల్లే ప్రభుత్వాలు కూలిపోతాయా? కూలిపోతాయని హడిలి చచ్చారు నాయాళ్ళు. పిరికి పందలు. పెడరెక్కలు విరిచి చెట్టుకుకట్టి నాలుగురౌండ్లు కాల్చారట. వొళ్ళల్లా తూటాల్తో జల్లెడయిపోయింది. చంపేసిన ఇరవైనాలు గ్గంటల తరువాత తనకి కబురు-

కట్టెనయినా అప్పగించేరు కారు చచ్చినోళ్ళు

చూడనిచ్చేరంతే చాలు

చింతపల్లి అడవుల్లో చంపేసేరట

నా నాయన జేబుల్లో బాంబులు పెట్టుకు తిరుగుతున్నాడట– ఎర్ర కరపత్రాలు పంచుతున్నాడట– పోరాడమని పాటలు పాడుతున్నాడట. పాటలంటే గుర్తొచ్చింది.

ఎంత బాగా పాడేవాడు- గుండెలు తెగిపోయేలాగ, మనసు మండిపోయేలాగ పాడేవాడు.

అతనివల్ల ఏమి హాని అనుకున్నారో చంపేశారు చచ్చినోళ్ళు

వీరుడు నా నాయన, నా బిడ్డ నా తండ్రి - అమరవీరుడు

వాళ్ళు తన కొడుకుమీద కూడా పాటలు కట్టేరు

అమరుడ జోహారులందుకో అని పాడేరు

కోటమ్మకు శోకం ఉప్పెనలాగ పొంగివచ్చింది. మనిషంతా కదిలిపోయి చుట్టుకుని చుట్టుకుని ఏడిచింది.

కూనీలు చేసేవాళ్లు బాగానే వున్నారు. దొంగరవాణాలు చేసేవాళ్లు బాగానే వున్నారు. ఆడకూతుళ్ళను పాడుచేసేకుక్కలకొడుకులు బాగానేవున్నారు. వందలకొద్దీ వేలకొద్దీ సిమెంటుబస్తాలు మింగినరెడ్డిగారు ఎంపీఅయ్యేరు. దొంగనోట్లు అచ్చేయించే వాడు మంత్రయ్యాడట. తప్పుడు తూకానికి కల్తీ సరుకులమ్మే దగుల్బాజీ చేర్మనయ్యాడట.

అమాయకులు జైళ్ళపాలు
దిక్కులేని చావు పాలు
గూండాలు రాజ్యాలు ఏలుతున్నారు. ధూ....
అంతా కళ్లారా చూస్తూనేవుంది కోటమ్మ

అమ్మా నీకష్టాలు తీరుస్తానే, పేదోళ్ళు సుఖంగా వుండటం కోసమే అసలు పేదరికం లేకుండా వుండటం కోసమే మేం పోరాడుతున్నామే అమ్మా, నీకేం భయం లేదే అనేవాడు నాబంగారు తండ్రి

ఎప్పుడు కూడు దినీవోడో, ఎప్పుడు కునుకుతీసేవోడో, రాత్రీపగలూ తిరుగుతానే వుండేవోడు.

కూలిపోయిన పాకముందు కుక్కపిల్లలు తల్లిదగ్గర పాలుతాగుతున్నాయి. గజ్జికుక్క ఎముక ముక్క కొరుకుతోంది.

రోడ్లమీద జనంలేరు-అంతాబంద్-తన పాకాకూలదోసేశారు అల్లరిమూకలు, అల్లరి మూకలు

ఆనాడు పెద్దకొడుకును అలా మింగీశారు. ఆ దుఃఖం పచ్చి ఇంకా ఆరక ముందే...

నిన్నటికి నిన్న రెండో కొడుకును మిలట్రీవోళ్ళు బలితీసుకున్నారు. బెజవాడలో ఒక ఎంపీని ఇంట్లో నిద్దరోతుండగా బాంబులు పేల్చి చంపేశారట. ఆ ముందటేడు అరడజను మందిని కూనీ చేయిచేడట ఆ పెద్దమనిషి. ఇప్పుడలాంటి సావు సచ్చేడు. దాంతో ఆ చుట్టుపక్కల ఊరూవాడా ఏకమైపోయింది, ఆడి కులపోళ్ళు రెచ్చిపోయేరు. ఢిల్లీ నించి పల్లెదాక కుదిపేశారు. నూటనలభైనాలుగు సెక్షనట, కనబడితేకాల్చేస్తారట.

ఏం నేరం చేశామని కాల్చేస్తారు!

తూర్పయినా తెల్లవార లేదు నిండా, సైకిలుకు పేపర్లుకట్టి ఇంటింటికీ ఇస్తున్నాడు. గుంపులో చిక్కిపోయేడు. పిచ్చెక్కి మిలట్రీవోళ్లు జెనంమీద తుపాకులు గురిపెట్టారు. పిట్టలా రాలిపోయాడు కొడుకు.

కొడుకా నా కొడుకా
కొడుకా నా ముద్దుల కొడుకా
నా కొడుకులు నిన్ను కాల్చేసేర్రా
నా బతుకు బండలు చేసేసేర్రా
నా కింకెవరు దిక్కురా నాయానా
పదహారేళ్ళ పసివయసులో పొట్టన పెట్టుకున్నార్రా
కొడుకా నా కొడుకా
నా కంటిదీపం ఆర్చేశారురా
కొడుకా నా కొడుకా

కోటమ్మ శోకాలు తీస్తున్నది.

గుండె ఆరనికుంపటిలా వుంది.

రెండో కొడుక్కి ఏడాది నిండేసరికే ఆ మహారాజు ఈ లోకం నుంచి సెలవు పుచ్చుకున్నాడు. రజాకార్ల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. మొదట్లో వరంగల్లే అనుకుంది తను. ఆ చుట్టుపక్కల అన్ని జిల్లాలూ అంతేనట. నైజాం రాజ్యం అంతా అలాగే వుందట. నైజాం సర్కారోణ్ణి గద్దె దించుతాం అనేవాడు. హనుమకొండలో రజాకార్లకీ 'సంగం' మనుషులకీ హోరాహోరీ యుద్ధం జరిగిపోయింది. నలుగురైదుగురు చచ్చిపోయారు. ఆయనకేమో రెండుకాళ్ళూ పోయాయి. అయినా పౌరుషం తగ్గలేదు.

రెండు కాళ్ళతో దేకుతూ తిరిగేవాడు. తరువాత చక్రాలబండి సంపాయించాడు. మాంచి తెలివైన బుర్ర. చెయ్యెత్తు మనిషి పెద్దపెద్ద మీసాలూ, పెద్దపెద్ద పోలీసాఫీసర్లని గడగడలాడించేవాడు. నైజాం సర్కార్ణోణ్ణి గద్దె దించుతాం అనేవాడు. దించేరు కాని ఏం లాభం? కాంగ్రేసు సర్కారు అంతకంటే ఘోరంగా వుంది. ఎప్పటికైనా ఈ దోపిడీ రాజ్యం కూలక తప్పదనేవాడు. ముందుముందు రానుంది బంగారుకాలం అనేవాడు. తనకేమీ తెలిసేది కాదు. ఆ లక్షణాలే పెద్దోడికీ వచ్చేయి. చిన్నోడు వెర్రిపీరు. పరమ అమాయకం.

అదేదో ఎర్రజెండాలో పెద్ద వూరేగింపవుతుంటే చక్రాలబండి మీద బయల్దేరాడు. సాయంత్రం ఇంటికొస్తూ లారీ కింద పడిపోయాడు. చక్రాల బండికి కట్టిన ఎర్రజెండా అలాగే వుంది. కాళ్ళే వుంటేనా ఇంత ఘోరం జరక్కపోను. పచ్చడి పచ్చడయిపోయాడు. శవాన్ని చూడలేకపోయింది.

గతం కళ్ళముందు ఆడింది

కోటమ్మ కంట్లోంచి రక్తంబొట్లు పడ్డాయి.

ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం

తుపాకిరాజ్యం దోపిడిరాజ్యం

అమాయకుల్ని చంపేస్తున్నారు. బ్రతికినవాళ్ళు శవాల్లాగే బ్రతుకుతున్నారు.

చిన్నకొడుకు అన్నెం పున్నెం ఎరగని అమాయకుడు.

తను టీ కొట్టు నడుపుతుంది. కొడుకు పేపర్లు పంచుతాడు. దినం ఒక మాదిరిగా వెళ్ళిపోతుంది. చివరికదీలేదు. కొడుకును తుపాకులు మింగేశాయి. టీ కొట్టు అల్లరిమూక ధ్వంసం చేసేశారు.

కోటమ్మ గుండెల్లో దుఃఖం లావాలా పొంగింది. ఎక్కిఎక్కి ఏడుస్తోంది. ఏడిచి ఏడిచి కళ్ళు ఎర్రబడిపోయాయి.

పాలుతాగుతున్న కుక్కపిల్లలు ఉన్నట్టుండి ఉప్పెనలా పొంగిన ఆ ఏడుపువిని బెదిరిపోయేయి.

అంతా శూన్యం. బతుకంతా వల్లకాడులా తయారైంది. తను మిగిలింది మొండి మోదులగ, దినం తరవాత దినం గడుస్తున్నాయి.

వెంకటసుబ్బయ్య వచ్చాడు. రిక్షాతొక్కుతుంటాడు.

"కోటమ్మాలే గుక్కెడు గెంజితాగు. మూడురోజులయింది ఏడిచినదానివి ఏడుస్తున్నట్టేవున్నావు పచ్చిమంచినీళ్లైనా ముట్టవు లే కోటమ్మ లే. లేచి ఇంత ఎంగిలిపడు," అన్నాడు.

ఏడుపు ఆపకుండానే వెర్రిచూపు చూసింది.

వెంకటసుబ్బయ్య చుట్టూచూసి గొంతుతగ్గించి చెబుతున్నాడు.

"కోటమ్మా నీ పెనిమిటీ నీ కొడుకులూ చిందించిన రక్తపు బొట్లు వూరికినే పోవు. ప్రభుత్వం చాలాసంక్షోభంలో వుంది. మారణకాండ - మంత్రుల రాజీనామాలు-ఇంకా గందరగోళంగా వుంది. ఇదే అదును సంఘటితంగా పోరాడమని మన పార్టీ పిలుపిచ్చింది. ఎప్పటికైనా ఎర్రజెండా ఎగరేస్తాం కోటమ్మా తప్పదు."

దిక్కు మొక్కు లేనిజనం

ఒక్కొక్కరు అగ్నికణం-అన్నాడు.

ఇందుకు నువ్వు సాయం చెయ్యాలి. రాత్రి మొదటాట ఇడిశాక ఈ చీటీ ఊరు చివర టీకొట్లోవుండే కుంటోడిదగ్గరకి సూరీడని ఒక కుర్రోడొస్తాడు-ఆడికిచ్చెయ్యాలి. ఆ సూరీడు అచ్చం నీ పెద్దకొడుకులా వుంటాడు. కాపోతే కొంచెం ఎరుపు. తప్ప కూండా ఇవ్వాల, మాం ఎవలం ఎల్లినా

అనుమానం వొస్తాది. నిన్నెవురూ అనుమానించరు. తప్పకంట ఎల్లాలిసుమా," అని ఒక చీటి యిచ్చాడు. అటూ యిటూ చూస్తూ వెళ్ళిపోయాడు. నిన్నంతా చాలాచాలా సంగతులు చెప్పాడు. ఇవ్వాళ ఈ చీటీ యిచ్చాడు.

ఈ దోపిడీ పాలన ఎప్పటికైనా విరగడై పోతుందా? అందుకు తను కూడా సాయంచెయ్యగలదా?

కళ్ళు తుడుచుకుంది. కళ్ళు ఎర్రగావున్నాయి. ఆకాశంవేపు చూపు నిలిపింది. ఆకాశం ఎర్రగా వున్నట్టనిపించింది. రక్తం ఎర్రగా మండుతున్నట్టనిపించింది. తన ఏడుపే తనలాంటి దిక్కులేనివాళ్ళ ఏడుపే చిక్కగా ఎరుపెక్కినట్టయింది. వెంకటసుబ్బయ్య ఇచ్చిన చీటీ జాగ్రత్తగా కొంగున కట్టుకుంది.

*రచన కాలం : 26-12-1988, బెజవాడలో వంగవీటిరంగ హత్య మర్నాడు.*
*ప్రచురణ : సాహిత్య ప్రగతి, ఆగస్టు / సెప్టెంబర్ 1989*